# పెళ్లి చూపులు

"సత్య"

"మా అన్నయ్యే కనక లేకపోతే, నన్నీపాటికి ఏ వెఱ్ఱి వెంగళాయికో కట్టేద్దురు మా నాన్నావాళ్ళూను. అసలు మాఅన్నయ్య పట్టుబలనే, నాకు మావాళ్ళు స్కూలుఫైనలు దాకానైనా చదువు చెప్పించేరు. మా అన్నయ్య అంటే ఇంటిల్లపాదికీ, కొంతవరకూ మానాన్నకికూడా, హడలే! అంటే మా అన్నయ్యకి పెద్దవాళ్ళంటే భక్తిలేదనికాదు. వాడు ఎప్పుడూ సరదాగా నవ్వుతూనే ఉంటాడు. నన్నూ, చెల్లాయినీ ఏడిపిస్తూ నవ్విస్తూనే ఉంటాడు. అమ్మదగ్గిర కూడా చిన్నపిల్లవాడికి మల్లే 'అవికావాలి ఇవికావాలి' అని మారాం చేస్తుంటాడు. అందరికన్నా మా బామ్మకి వాడంటే పంచ ప్రాణాలూను. ఆవిడకి కావలసిన నల్లమందు వగైరాలు అతి శ్రద్ధగా అందజేస్తుంటాడు. అందుకే ఆవిడ అప్పుడప్పుడనేది "నాకు మా పుట్టింటాళ్ళు ఇచ్చిన ఆస్తిఅంతా మా రాంబాబుకే రాసిస్తాన"ని. అయితే ఆవిడతో మా అన్నయ్యకు ఒక్కచోటే తగవులాట వచ్చేది "నేను చావకుండా పెళ్ళి చేసుకోరా నాయనా" అంటే 'ససేమిరా' అంటూండేవాడు. ఇంకా కొంచెం బామ్మకి కోపం వస్తుందని కనిపెడితే "అప్పుడే ప్రయాణం అవుతే ఎలాగ? నేను ఇంకా పెళ్ళి చేసుకోకుండా ఉంటే నువ్వు ఇంకా పెళ్ళి చూడటానికి బ్రతికి ఉంటావు. చప్పుని పెళ్ళి చేసికొని నిన్ను చప్పుని పరలోకానికి ప్రయాణం కట్టించడం నాకిష్టంలేదు" అంటూ చమత్కారంగా మాట్లాడే వాడు.

"ఇంతికీ చెప్పొచ్చే దేమిటంటే మా అన్నయ్య అంటే ఇంటిల్లపాదికీ ప్రేమే! కాని వాడికి కొన్ని అభిప్రాయాలూ నియమాలూ ఉండేవి. వాటి కేమాత్రం విఘాతం కలిగినా సహించలేక పోయేవాడు. దాంతో విపరీతమైన కోపం వచ్చేది. ఆ కోపంతో వాడిమాటకి తిరుగులేదు. మానాన్న అయినా సరే వాడి ఎదురుగుండా, వాడి దృష్టిలో న్యాయ విరుద్ధమైన పని చేయడానికి వెరుస్తారు.."

అంటూ జానికి వాళ్ళ అన్నయ్యనుగురించి చెపుతోంది. "ఇంతకీ పెళ్ళిచూపులు విషయమేమయిందీ? మధ్యలో మీ అన్నయ్యని గురించి మొదలెట్టావ్" అన్నా కుర్చీలోంచి సగానికి లేచికూర్చుంటూ."

"అవునన్నట్టు, అసలు విషయం మానేశా. ఆరోజున నాకు పెళ్ళివారు వస్తానన్నరోజు. అన్నయ్య ఉంటే సంబంధం స్థిరపడదు. ఏమంటే కట్నాలు లేకుండా యీ రోజుల్లో పెళ్ళిజరగడం అనేది అసంభవం. పెళ్ళిమాటల్లో కట్నం విషయం రాగానే మా అన్నయ్యకి ఉద్రేకం ఆగదు. కట్నాలన్నా, స్త్రీబానిసత్వం అన్నా మా అన్నయకి అరికాలిమంట నెత్తికెక్కుతుంది. వచ్చిన వాళ్ళని అగౌరవపరచి "డబ్బుకి అమ్ముడుపోయే బానిసకి మా చెల్లాయిని పెళ్ళి చెయ్యం. మీరు వెళ్ళొచ్చు" అనేలాగ మాట్లాడుతాడు. దాంతో వచ్చినవాళ్ళు కాస్తా చక్కాపోతారు. మా అన్నయ్య యీ ప్రవర్తనకి మా నాన్నావాళ్ళూ అడ్డురారు. వస్తే యీఅగౌరవమే వాళ్ళకి జరుగుతుందని వాళ్ళకి తెలుసు. ఇల్లాగే నాలుగైదు సంబంధాలు దాటిపోయాయి, మా అన్నయ్య ధర్మమా అంటూ. యీ మాటువచ్చే సంబంధం గొప్ప ఎత్తులలోదనీ, ఇది దాటిపోతే ఇంతకన్నా మంచి సంబంధం రాదనీ మా నాన్నా అమ్మా అన్నయ్యకి తెలయకుండా అనుకుంటున్నారు. వాళ్ళ మాటలుచాటుగా విన్న నాకు అదోలా అనిపించింది.

"ఇప్పటివరకూ వచ్చినవి మంచి సంబంధాలు కాక పోబట్టి అన్నయ్య యీ సంబంధాలు తప్పించటానికి చేసిన ప్రయత్నమంతా నాకూనచ్చింది. యీ వెఱ్ఱిమొఱ్ఱి సంబంధాలు తప్పించినందుకు అన్నయ్యని మనస్సులోనే ఎన్నిసార్లో అభినందించుకున్నా. కాని యీ సంబంధం చాలా మంచిదిలా ఉంది. వరుడికి ఇరవై ముప్ఫై ఎకరాల భూమి ఉందట! వయస్సు ఇరవై—బి. ఏ. చదువుతున్నాట్ట—బి. ఏ. అనగానే మా అన్నయ్యలాంటి ఉన్నత భావాలుంటాయని తెలుసుకొనేప్పటికి నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. మా అన్నయ్య ధర్మమా అంటూ యీ సంబంధం తప్పిపోక

పోతే బాగుండు ననిపించింది. అప్పటి నా ఆలోచన చూస్తే ఇప్పుడు సిగ్గేస్తోంది—

"యీ నా పెళ్ళిసంబంధం విషయం అన్నయ్యకి తెలియకుండా కట్టుదిట్టంచేసి పెళ్ళివారు వచ్చేరోజుకి అన్నయ్యని శిస్తులు వసూలు చేసుకురమ్మని మాఊరు పంపారు నాన్నగారు . .... ..

ఆరోజునే పెళ్ళివారు నన్ను చూసుకోవడానికి వచ్చే రోజు. ప్రొద్దుటే అన్నయ్య బయలుదేరి ఊరికి వెళ్ళిపోయాడు. వాడు వెళుతూంటే నాకు ఒకమూల సంతోషంగా ఉన్నా ఒక మూల విచారం లేకపోలేదు ఏమంటే ప్రతీమారు వచ్చిన వరుడి స్వభావాల్నీ, అభిరుచుల్నీ ఇట్టే గ్రహించి నాతో వచ్చి చెప్పేవాడు. "అతనికి పోషుచేసుకోవడం తప్ప మరేమీ తెలియదనీ, విశాల హృదయం లేనివాడనీ, అన్నీ బాగానే ఉన్నాయి కాని ఆ అబ్బాయికి శాంతం అనేది ఏ కొశాన్నా లేదనీ" యీ విధంగా వచ్చిన వ్యక్తి నాకు అనుకూలుడవునోకాదు ఇట్టే గ్రహించి వర్ణించేవాడు. నిజానికి మా అన్నయ్య లేకపోతే ఇలా నా శ్రేయస్సుకోరి వరుడి అర్హతానర్హతలు గ్రహించే వారే లేరు. ఒకవేళ ఎవరైనా ఉన్నా మా అన్నయ్యకి ఉన్నయీ మహత్తరశక్తి ఎక్కడనుంచి వస్తుందీ?

"చివరికి అన్నయ్య వెళ్ళిపోయాడు .. .

"మధ్యాహ్నం రెండుకావస్తోంది. మా అమ్మ నాకు జడ అల్లి ముస్తాబు చేస్తోంది. యీ చీరకాదని ఆచీరా, అది కాదని ఇదీమార్చి చివరికి మబ్బురంగుచీర అదేరకం జాకట్టూ తొడిగి తగుమాత్రం అయిన నగలతో నన్ను అలంకరణ చేసింది మా అమ్మ. అప్పటికప్పుడే మా నాన్న స్టేషను కెళ్ళాడు పెళ్ళివారిని తీసుకు రావడానికి. చెల్లాయి అంతకు మునుపే తయారయిపోయిందేమో, వసారాలో తివాసీలూ ఆవీపరిచి, అగరువత్తులు వగైరాలు అమర్చే హడావిడిలో ఉంది. నాకు బొట్టుపెట్టి తనుముఖం రుద్దుకోవడానికి అమ్మ దొడ్లోకి వెళ్ళింది. నేను అద్దంముందు నుంచుని బొట్టు సరి చేసుకుంటున్నాను. ఇంట్లో చెల్లాయి హడావుడితప్ప మరేంలేదు. నేనున్నగది ప్రక్కనే వసారా—ఆ వసారాలోనే చెల్లాయి పాటలు పాడుకుంటూ చాపలూ అవీ మారుస్తోంది ఇక్కడి వక్కడికీ అక్కడి విక్కడికీను. గడియారం 'టిక్-టిక్' మంటూ మూడు గంటలు దాటిపోతోంది. నా గుండెకూడా గడియారం శబ్దంతో సమానంగా లయ వేస్తోంది.

ఇంతలో మా యింటిముందు బండి ఆగింది. వెంటనే అనుకోకుండా కిటికీలోంచి తొంగిచూశా. ముందు మా నాన్న దిగారు. వెంటనే ఇంకోముసిలాయన మానాన్న చేతి సాయంతో దిగారు. ఇంక ఆ కిటికీగుండా చూస్తూండటం బాగుండదని కిటికీజేరేసి, ఆ గదిలోనే పెట్టిమీద కూర్చుని ఉన్నా. మనస్సు పరిపరి విధాల పోతోంది. ఆ వచ్చినవ్యక్తి ఎలాఉంటాడు? ఎటువంటి వాడు. అతనుకూడా దిగేదాకానైనా కిటికీ దగ్గర నిలబడితే బాగుండిపోను ..తొందరెందుకు? కొద్దిసేపట్లో చూడవచ్చునుగా? ఇలా అనుకుంటుంటే మా చెల్లాయి లోపలికి పరిగెట్టుకు వచ్చి నా చెవిలో "వాళ్ళువచ్చారే అక్కా" అని చెప్పి మళ్ళీ వసారాలోకి వెళ్ళిపోయింది. దాన్ని అడిగి కొన్ని విషయాలు తెలిసికుందామని "మాటఇల్లారా" అంటూంటే వినిపించుకోకుండా వసారాలోకిపోయి స్థంబాన్ని ఆనుకుని వచ్చిన వాళ్ళని చూస్తూ నిలబడింది.

ఇంతట్లోకీ నాన్న నా గదిలోకివచ్చి "వాళ్ళువచ్చారు అమ్మాయీ! మీ ఆలశ్యం లేదుగదా? అమ్మేదీ?" అంటూంటే యీ హడావుడి అంతావిని కాబోలు అమ్మ గదిలోకి వచ్చింది ముఖం తుడుచుకుంటూ. చెవుల్లోఉన్న సబ్బయినా చూసుకోకుండా వచ్చిన అమ్మ కంగారు చూస్తే నాకు నవ్వు వచ్చింది. మా నాన్న చెప్పేమాటలు వినిపించుకోకుండా అమ్మ గుమ్మంలోకి వెళ్ళి ఒక్కమారు తొంగిచూసి వచ్చి "పిల్లాడు మన్మధుడులాగున్నాడు" అంది. ఆ మాట వింటే నా హృదయం అదోలా ఝుల్లుమంది.

ఆవిడ వరుని మేనత్తట! (తరువాత కాసేపటికి తెలిసింది). గదిలోకి వచ్చింది. చాపేసి మా అమ్మ ఆవిడను ఆహ్వానించింది. నేనూ వెంటనే పెట్టెదిగి చాపమీద కూర్చున్నా. (నావినయానికి ఆవిడ తర్వాత అభినందించింది). ఆవిడ

ఏభైయేళ్ళ ముత్తయిదు. పూర్వకాల అలంకారాలతో బనారసు చీర కట్టుకొని పట్టెడ నాను వగైరా వస్తువులతో నాకు దగ్గిరగా చాపమీద ఖైటాయించిరి. కాస్సేపటిదాకా నావైపే తదేకధ్యానంతో చూస్తూ ఊరుకుంది కాని ఏమీ మాట్లాడలేదు.

"అంతక్రితమే వసారాలోకి వెళ్ళిపోయిన నాన్నగారు చెల్లాయిని పంపారు. చెల్లాయి గదిలోకివచ్చి అమ్మచెవులో ఏదో ఊదింది. అంతక్రితమే తయారుచేసిన టిఫెన్, కాఫీ చెల్లాయిద్వారా వసారాలోకి పంపింది అమ్మ. గదిలోఉన్న ముసలి ముత్తయిదుకు అమ్మే టిఫెన్, కాఫీ ఇచ్చింది కాని ఆవిడ తను తీసుకోనని సౌమ్యంగానే నిరాకరించింది . ...

"అసలు కథకన్న ఉపోద్ఘాతమే పెరిగిపోతోందే ?" అన్నా.

"టూకీగా చెప్పేస్తా విను. టిఫెన్లయాయి. యీలోగా మా నాన్న ఇంకో కంఠం (వరుని తండ్రిదనుకుంటా) ఏవేవో రాజకీయాలూ, రేషనింగులూ గురించి చర్చించుకున్నారు. కాస్సేపటికి మా చెల్లాయి లోపలికి వచ్చి నాఫిడేలు పట్టికెళ్ళి వసారాలో పెట్టింది.

"మా నాన్న లోపలికివచ్చి "అమ్మాయిని తీసుకొనిరా" అని అమ్మతో చెప్పి వెళ్ళిపోయారు. మా అమ్మ నాచెయ్యి పట్టుకొని వసారాలోకి నడిపించుకు వెళుతుంటే నాగుండె ఆగిపోతుందేమో నన్నంతవేగంగా కొట్టుకోసాగింది. కాళ్ళు వణకిపోయాయి. తడపడుతూ వెళ్ళి వాళ్ళకి కొంచెం దూరంలో ఎదురుగుండా వేసిన చాపమీద నెమ్మదిగా కూర్చున్నా. ఎదురుగుండా మా నాన్న కాక ఇద్దరువ్యక్తులు కూర్చున్నట్లు గ్రహించా కాని ధైర్యంతో తలెత్తి చూడలేక పోయా—మగవానికున్న ధైర్యం ఆ క్షణంలో ఆడదాని కెందుకుండదో ? ఆ వరుడూ అతని తండ్రీకూడా నన్ను రెప్ప వాల్చకుండా చూస్తూంటారు కదా ! యీ ఆలోచన వచ్చే టప్పటికి తలెత్తి వరుని వేపు చూద్దాం అనిపించింది కాని ధైర్యంఏదీ ' . ...

"నీ పేరేమిటమ్మా" అంది ఒక కంఠం. అది పెళ్ళి కుమారుడి తండ్రిదనుకుంటా.

"చెప్పమ్మా" అని మానాన్న హెచ్చరించారు.

"జానకి "అన్నా నెమ్మదిగా వంచిన తల ఎత్తకుండానే.

"అమ్మాయి ఎంతవరకు చదువుకుందీ."

"స్కూలుఫైనలు చదివిందండి" అన్నారు మా నాన్న.

"వాళ్ళ అందరికళ్ళు ఏంమాట్లాడుకున్నారో తలవంచుకు కూచున్నాను కనుక నాకు తెలియదుకాని మా చెల్లాయి తెచ్చిన ఇంగ్లీషు పుస్తకం నా కర్తవ్యాన్ని తెలిపింది. నిజంగా నాకు అప్పుడు ఉడుకుమోతుతనమే వచ్చింది. స్కూలు ఫైనలు చదివిందంటే అంతనమ్మకం లేకుండా మళ్ళీ అక్కడో పబ్లిక్ ఎగ్జామినేషనా ?...అదే పెళ్ళికుమారుడి బి. యే. డిగ్రీ చూపమని మేంఅడిగితే ఏమవుతుంది ? .." మమ్మల్ని నమ్మకుండా మా మాటమీద గౌరవంలేక మమ్మల్ని అగౌర పరిచారు—పోనీ మా అబ్బాయి బి. ఏ. చదవలేదు—సరేనా ?" అంటూ విపరీతమైన కోపంతో యీ పెద్దలు లేచిపోతారే ?. ఈ పరీక్ష ఆడదానికిమాత్రం అవమానం కాదుకాబోలు ?. .ఇప్పుడే కనుక మా అన్నయ్య ఉంటే వాళ్ళు నన్నుచేసే యీ పరీక్షకు వళ్ళుమండి అవతలకి గెంటివేసి ఉండును.

"చివరకి చదవడం ఎలాగూ తప్పదు కనుక చదివాను. ఆ ముసలాయన మనస్సు తృప్తిపడింది కాబోలు "ఇంతబాగా ఇంగ్లీషు చదివే పిల్లలకి తెలుగులో వాక్స్ఫూర్తి ఉండడం చాలా కష్టంసుమాండి" అన్నాడు. అదిఒక లోపంగా సంబంధం ఎక్కడ చెడిపోతుందో అనే భయంతో మా నాన్న భారతం తెప్పించి నాచేత బలవంతంగా చదివించారు. నాకు తెలుగు చదవడం రాకపోతేగా ? ..భారతం చదివే టప్పటికి నాకు కొంతవరకూ సిగ్గు తగ్గింది. పుస్తకంమూసేస్తూ అప్రయత్నంగా తలయెత్తి వాళ్లవేపు చూశా. వరుని తండ్రి అంగీకార సూచకంగా అర్థనిమీలితలోచనుడై పురాణం వింటున్నవాడికి మల్లేబుర్ర ఊపుతున్నాడు. పెళ్ళికుమారుడు అన్య మనస్కంగా ఉన్నవాడు హటాత్తుగా నా కళ్లలోకి చూశాడు. చటుక్కున తల వంచేశా. అబ్బ ఆ కళ్లు అంత కఠినంగా ఉన్నాయేమిటి ? సౌమ్యత నెమ్మదితనం ఆకళ్లలో లేనేలేవు—ఆకళ్లని చూస్తేనే భయంవేసింది. మనిషి యీ కాలపు అందరి స్టూడెంట్లకి మల్లేనూటు వగైరాలతో రీవిగానే

ఉన్నాడు, కాని అతనిలో సహజ సౌందర్యంనాకు ఏ కోశాన్నీ కనిపించలేదు.

"తరువాత సంగీతం పాడించారు. వరుని తండ్రి "వీణ చెప్పించక పోయారూ" అన్నాడు తేలిగ్గా. నాకు వళ్లు మండిపోయింది." వీళ్లసొమ్మేం పోయిందీ? వీణ నేర్చుకుంటే భరతనాట్యం అభ్యసిస్తే బాగుండిపోను అంటారు. వీళ్లకోసం ప్రపంచంలో ఉన్న అన్నికళలూ అన్నిశాస్త్రాలు అభ్యసించి కూర్చోవాలిగావును! తన కొడుక్కు కవిత్వం వచ్చా? చిత్రలేఖనమో!! అబ్బే ఇవేమి పెళ్లికొడుక్కు అవసరంలేదు. సరే అక్కడనా అవసరం తీరిపోయింది. గదిలోకి వచ్చాక ఆ ముసలావిడ ఉందే—ఆవిడా. నా శారీరక పరీక్ష మొదలుపెట్టింది. అతినెమ్మదిగా మాట్లాడి నాకు చెవుడులేదనీ, చిన్న అచ్చుపుస్తకం దూరంగా పెట్టి చదివించి కంటి జబ్బులేదనీ దొడ్లోదాక, నడిపించుకువెళ్ళి (యీలోగానా నడక పరీక్షిస్తూ) నాకు కుంటివంటి రోగం ఏదీలేదనీ ఒక నిర్ధారణకి వచ్చింది. ఇవన్నీ చేస్తున్నప్పుడు నాకు విపరీతమైన కోపం, ఉడుకుమోతుతనం వచ్చాయి. కాని తప్పదు—ఆడపిల్లయి జన్మించినందుకు శిక్షగా పెళ్ళిచూపుల్లో యీ అన్ని పరీక్షలకీ నిలవవలసిందే!

"వసారాలో కట్నం విషయమై చర్చ జరుగుచున్నట్లు అక్కడనుంచి వచ్చే మాటల్నిబట్టి గ్రహించాను. బేరం అయిదువేలలో నడుస్తోంది. మా నాన్న నాలుగువేలకి ఎల్లాగేనా సెటిల్ చేద్దామని చూస్తున్నాడు.

నాలుగువేలు!

మా సంసార పరిస్థితి ఎక్కడ? నాలుగువేలు ఎక్కడ? మా నాన్న ఏమైనా ఆలోచించే యీ మాట అంటున్నాడా?

ఇంతట్లోకే మా అన్నయ్య వచ్చాడు. వసారాలో జనాన్ని చూశాడు. తిన్నగా గదిలోకివచ్చి నన్ను దొడ్లోకి తీసుకువెళ్లాడు. జరిగిన విషయమంతా అన్నయ్యతో ఏడుస్తూ చెప్పాను. గబగబా వసారాలోకి వెళ్ళి "మీకు మా అమ్మాయి నచ్చిందా?" అన్నాడు.

"ఆఁ! పిల్లకేం?" అన్నాడు ముసిలాడు.

"క్షమించండి—మా అమ్మాయికి అబ్బాయి నచ్చలేదు" అన్నాడు—ఇంకేముంది? అయ్యాయి పెళ్ళిచూపులు" అంటూ జానకి ముగించింది. నేనూ లేచాను.

★


పసిపిల్లలకు వరప్రసాదిని
పిల్లల లివరు, స్ప్లీను వ్యాధులకు
జమ్మివారి
లివర్ క్యూర్
కెమిస్టులందరివద్దను దొరకును.

2 రకముల ఔషధములు-
(1) వ్యాధి ముదరని సాధారణరుగ్మతలకు
(2) ప్రమాదకరమైన లక్షణములు కలిగిన కఠినమైన వ్యాధులకు

జమ్మి వెంకటరమణయ్య & సన్సు హెడ్ ఆఫీసు మైలాపూరు మద్రాసు.

J 12.—Telugu